# పిల్లల కోసం

విజయశ్రీ

సుధాకరరావు రోజూలాగే ప్రొద్దున్నే లేచాడు ఆరున్నరకి, [illegible] డబుల్‌కేసెట్ డెక్ స్టీరియో రిసీవర్ సిస్టమ్ ఆటోమాటిక్‌గా ఆనయినవెంటనే.

"అంత లౌడ్‌గా ఎందుకు పెడతారు" అంటూ గొణుక్కుంది వాళ్లావిడ ఇటువైపునుంచి అటువైపుకి పక్కంతా తిప్పుకుని. కళ్లుమూసుకునే అంద[illegible]నాలుగుమాటలూ. సుధాకరరావు సౌండ్‌సిస్టమ్ ఆఫ్ చేశాడు వెంటనే. నింపాదిగా బాత్‌రూమ్‌లోకి తడుముకుంటూ వెళ్లి లైట్ ఆన్‌చేసి కాలకృత్యాలు మొదలు పెట్టాడు. ఇరవై నిముషాల్లో అన్నిపనులూ ముగించుకుని బయటకివచ్చి గాఢనిద్రలోకివెళ్లిపోయిన వాళ్లావిడకేసి ఒకసారి చూసి చప్పుడుచెయ్యకుండా అడుగులో అడుగు వేసుకుంటూ వాకిన్ క్లాసెట్‌లోకి నడిచాడు. నిన్నరాత్రే రెడీగాపెట్టుకున్న బట్టలు తీసి వేసుకున్నాడు. తడితువ్వాలు పట్టుకెళ్లి బాత్‌రూములో ఆరేశాడు జాగ్రత్తగా గ్లాస్ పార్టిషనుమీద. ఒకసారి అద్దంలోకి చూసుకుని టై సర్దుకుని తలదువ్వుకున్నాడు. దువ్వెన వెంటనే కడిగి తుడిచి దానిప్లేసులో ఉంచాడు. నెంపాదిగా బెడ్‌రూమ్ లోంచి చప్పుడు చెయ్యకుండా లివింగ్‌రూమ్‌లోకి వచ్చాడు.

టివి ఆన్ చేసి న్యూస్‌విందామని అనుకున్నాడుకాని మనస్సుమార్చుకున్నాడు. అప్పుడే [illegible]యింది. త్వరగా బ్రేక్‌ఫాస్ట్ తిని బయటపడదామని కిచెన్ వేపు నడుస్తోంటే ఫోన్‌రింగయింది లౌడ్‌గా. ఒక్కసారి ఫోన్‌దగ్గరకి దూకినట్లు సమీపించి రిసీవరెత్తాడు.

"మే ఐ స్పీక్ టు డాక్టర్ కౌంటి ప్లీజ్? " సన్నని గొంతుక వినిపించింది ఫోన్లో.

"యస్, దిస్ ఈజ్ డాక్టర్ కౌంటి స్పీకింగ్, మే ఐ నో హూ ఈజ్ కాలింగ్? "

"దిస్ ఈజ్ జెనిటెక్ లేబ్. ప్లీజ్ హోల్డ్ ఫర్ ఒన్ సెకండ్. ఐ విల్ కనక్ట్ యూ టు డాక్టర్ యాష్టన్. "

కొన్ని నిముషాలు నిశ్శబ్దం. కాస్సేపు సంగీతం వినిపించింది. రిసీవర్ చెవిదగ్గరుంచుకునే దగ్గరలోనే పక్క సోఫా మీద కూర్చున్నాడు. నిన్నరాత్రి పడుకోబోయేముందే అనుకున్నాడు, అప్పుడే [illegible]వారాలు పైగాఅయిపోయింది జెనిటెక్ వాళ్లతో మాట్లాడి , ఇంతవరకూ ఏకబురూ లేదేమిటూ అని.

"సారీ టు హేవ్ కెప్ట్ యూ సోలాంగ్ డాక్టర్‌కౌంటీ, దిస్ ఈజ్ మేరీ యాష్టన్ హియర్........ " పదిహేను నిమిషాలు జరిగిందా ఫోను సంభాషణ.

* * * * * *

క్రిందటి సంవత్సరం ... మార్చి 22వ తారీఖు... ఎక్స్‌ప్రెస్ డెలివరీలో వచ్చింది ఒక పెద్ద మణీలా ఎన్వలప్. తన మేకింటోష్ కంప్యూటర్ ముందుకూర్చుని ఫైనల్‌డ్రాఫ్ట్ తయారు చేస్తున్నాడు ఫిన్లాండు ఇంటర్నేషనల్ కాన్ఫరెన్సులో తను చదవబోయే పేపరు. మాడిసన్‌నుంచి తనతోకలిసి పరిశోధనలుచేస్తున్న నరేందర్ దగ్గరనుంచి కొన్నికేల్కులేషన్లు రావాలి. ఈవేళరాకపోతే వెంటనే ఫోనులోపిలిచి ఫాక్సుచెయ్యమందామనుకుంటున్నాడు. ఎన్వలెప్ చేతికిరాగానే తొందరగా చింపి లోపలికాగితాలు బయటికి తీశాడు. అవి నరేందర్ దగ్గరనుంచి కాదు, కాలిఫోర్నియాలో ఉన్న జెనిటెక్‌లాబ్ నుంచి. ఏదో షాక్సు కొనమని సొలిసిట్‌చేస్తూ వ్రాసిన ప్రొమోషనల్ లిటరేచరనుకున్నాడు. వెంటనే వేస్టుపేపరు బాస్కెట్‌లో పడేశాడు. స్వివెల్ ఛైర్‌లో తనకంప్యూటర్‌వైపు తిరిగాడు కొంచంవిసుగుతో, కొంచం నిరుత్సాహంతో. ఒక్కక్షణం ఆలోచించి బాస్కెట్‌లోంచి ఆ కాగితాలుమళ్లీతీసి డస్కుమీద పరిచి చదవటం ప్రారంభిచాడు.

కళ్లు ఉత్తరంచివరున్న సంతకంమీదకి వెళ్లాయి. మేరీ యాష్టన్ ... ఆపేరు ఎప్పుడూ వినలేదు. ఎవరీ మనిషి?.. ఎంత ఆలోచించినా గుర్తుకి రావటంలేదు. ఇది తప్పకుండా ఎడ్వర్టైజమెంటు అని నిర్ణయించుకున్నాడు మనస్సులో. అయినా ఉత్తరం చదవటం ప్రారంభించాడు. రెండు పేరాలు చదివాడు. కాలిఫోర్నియాలో ఏదో స్పెర్మ్‌బేంక్ గురించిన విషయం. మూడో పేరాలోకి వచ్చాడు.....

We are able to identify several potential donors for depositing their sperm in our bank. Our research was indeed based on a comprehensive data source. There is no obligation for you to participate in this project. After studying the remaining pages in this document, if you can persuade yourself that you are a suitable target individual, please supply us with the information requested on pages seven, eight and nine of this document and return to us in the enclosed envelope.....

మిగతా పేజీలన్నీ ఆగకుండా చదివేశాడు.

ప్రపంచంలో చాలా తెలివితేటలు గలవాళ్లని, తమ మేధాశక్తి, సృజనాశక్తి ఉద్యోగరీత్యా గాని, మరొకవిధంగాగాని ప్రదర్శించిన వాళ్లని సెలక్టుచేసి వాళ్లదగ్గరనుంచి స్పెరమ్ (వీర్యం) సేకరించి ఫ్రీజ్‌చేసి ఒక బేంక్‌లో నిలవ చేస్తారు ఈ జెనిటెక్ లాబ్ వాళ్లు. చక్కని తెలివితేటలుగల పిల్లలు కావాలనుకున్నవాళ్లు ఈ స్పెరమ్ అడిగితీసుకుని వాడుకోవచ్చును. అయితే అడిగినవాళ్లకల్లా స్పెరమ్‌ని దానంచెయ్యరు ఈబేంక్. అర్హతున్నవాళ్లకే ఇస్తారు. పైగా పెళ్లి చేసుకుని సుఖంగా దాంపత్యజీవితం గడుపుతూ తగిన ఆర్థిక స్తోమత ఉన్నవాళ్లకే ఇది.

* * * * *

షుమారు రెండేళ్లక్రితంసరిగ్గా ఇదేరోజనుకుంటాను మెక్నాటన్ ఫౌండేషన్ దగ్గరనుంచి ఫోనుకాల్ వచ్చింది సుధాకర్‌కి.

" You have been selected for a McNaughton Fellowship. We do not know if you have heard of us before. This fellowship means you will receive about $ 500,000 over the next three years. You are free to do what ever you want to do with it. This is a recognition of your creativity and promise.This is awarded by our Foundation in the hope that you will be able to continue your work without any encumberances...."

అసలా ఫౌండేషన్ పేరే తను ఎప్పుడూ వినలేదు. మెక్నాటన్ ఫౌండేషన్ ప్రైజ్ వచ్చినట్లు ఊళ్లో ఉన్న మిగతా ఇండియన్సుకి తెలియటానికి కొన్నాళ్లు పట్టింది. ఇండియా ఓవర్సీస్ అనే పత్రికలో ఈసంగతి ఒకచిన్న పేరాగ్రాఫ్ పడింది కొన్నాళ్లు పోయాక. ఆవార్త చదివిన స్నేహితులు కొందరు ఈయన్ని వెంటనే పిలిచి కంగ్రాచులేషన్లు చెప్పారు. ఆరునెలలు పోయాక ఆవూళ్లో తెలుగు అసోసియేషన్ వాళ్లు ఈయనకి ఒక చిన్నసన్మానం కూడా చేశారు.

కొంటి సుధాకరరావు అమెరికావచ్చి ఇరవైరెండు సంవత్సరాలయింది. తను ఈదేశం రాకపూర్వం తన భవిష్యత్తు గురించి అనేకరకాల కలలుగంటూ ఉండేవాడు. కాని పేరుప్రఖ్యాతులుగన్న విజ్ఞానవేత్త నవుతానని అనుకోలేదు. చిన్నతనంలో వాళ్లతాతయ్యతో డంబాలు కొడుతూండేవాడు నేను ప్రపంచమంతా తిరిగివస్తాను పెద్దయ్యాక అంటూ. గత అయిదు సంవత్సరాల్లోనూ ఎన్నో అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొని ఉపన్యాసాలివ్వడంవల్ల ఆమాట నిజమయిందనే చెప్పాలి. అమెరికను సిటిజన్‌షిప్ తీసుకున్నతర్వాత కూడా భారతదేశంలో పత్రికలన్నీ ఇతన్ని గురించి వ్రాసినప్పుడల్లా ప్రఖ్యాత భారతీయశాస్త్రవేత్త డాక్టరు సుధాకరరావు అనే రాస్తాయి ఇప్పుడుకూడా.

అమెరికావచ్చి డాక్టరేటు డిగ్రీసంపాయించి రెండుసంవత్సరాలు పనిచేశాక ఇండియావెళ్లి పెళ్లిచేసుకొచ్చాడు శారదని. శారద యంబిబియస్ పాసయివచ్చింది. ఎఫ్. ఎమ్.జి లు పాసవ్వాల్సిన పరీక్షలు, స్పెషలైజ్ చెయ్యటానికి ఫెలోషిప్పులు, రెసిడెన్సీ-- శారద ఇవన్నీ పూర్తిచేసిందాకా పిల్లలకోసం వాళ్లు ప్రయత్నించలేదు. తర్వాత శారద తనప్రైవేటు ప్రాక్టీస్ స్థిరపడిందాకా ఆగుదామంటే సుధాకరరావు అలాగే నన్నాడు. అలా పదిహేను సంవత్సరాలనుకోకుండా గడిచిపోయాయి. తీరా ప్రయత్నం ప్రారంభించాక ఎన్నాళ్లకీ ఫలితం దక్కక పోవటంతో శారద ప్రోత్సాహంతోటే వాళ్లిద్దరూ టెస్టులు చేయించుకున్నారు. శారదకున్నకాంప్లికేషన్సుతో పిల్లలు పుట్టడం వీలుకాదని తేలింది. ఈ విషయం తెలిసిన కొన్నాళ్లపాటు వాళ్లజీవితాల్లో అనుకోని నిరుత్సాహం వాళ్లని కష్టపెట్టింది. కాని ఇద్దరూ ఉద్యోగరీత్యా నిమగ్నులైపోయి ఆ పరిస్థితులకి తట్టుకోగిలిగారనే చెప్పాలి.

రెండేళ్లక్రితం సుధాకరరావు తల్లి శాంతమ్మగారు వచ్చి నాలుగు నెలలపాటు ఉండివెళ్లింది. తనతల్లి మంచితనంగురించి ఎంతోగొప్పగా చెప్పుకుంటూ ఉండే సుధాకరరావుకి ఆనాలుగునెలల్లోనూ చూసినతల్లి తనతల్లిలా కనిపించలేదు. ఉన్నన్నాళ్లు శాంతమ్మగారు తనకోడలి గొడ్రాలితనం గురించే మాట్లాడింది ఊళ్లో తెలుసున్న వాళ్లందరితోటి. చివరకి వెళ్లిపోయేరోజున ఎయిర్‌పోర్టులో పక్కకితీసుకెళ్లి శాంతమ్మ సుధాకరరావుతో అంది, "ఎంతోమంది శుభ్రమైన అందమైన పిల్లలని చూపిస్తే యంబిబియసు పిల్లంటూ ఈ అందకత్తెని చేసుకున్నావు. ఇప్పటికయినా మించిపోయిందేమీలేదు. ప్రతివాళ్లూ శాశ్వతంగా ఒకళ్లతోటే మడిగట్టుకు కూర్చోటంలేదు." ఆమాటలు విన్నతర్వాత అమ్మమీద మమకారం తగ్గకపోయినా గౌరవం పోయింది. ఏమీ అనకుండా జాగ్రత్తగా ప్రయాణంచేసి వెళ్లు అని సాగనంపేశాడు.

తనకి పిల్లలు పుట్టరని తెలిశాక శారద ఎవరినయినా పెంచుకుందామా అని ఒకటి రెండుసార్లు అడిగింది. పెంచుకున్న పిల్లలని మనస్వంత పిల్లలుగా ప్రేమించగలమా? అన్నాడు సుధాకర్.

స్పెరమ్‌బేంక్ నుంచి రిక్వెస్టు రావటంతోటే మళ్లీ పిల్లలని పెంచుకోవటం గురించి ఇద్దరిమధ్యన రెండుమూడుసార్లు చర్చలు జరిగాయి. తనకి అభ్యంతరంలేదని ఖచ్చితంగా శారద చెప్పలేదు కాని నాకడుపునపుట్టినవాళ్లే నాపిల్లలు, మరెవ్వరితోనూ నాకు సంబంధం అనవసరం అంది ఒక రోజున.

మరొకరోజున చాలాసేపు డిస్కషనయింతర్వాత "ఎన్నిబేంకుల్లో డిపాజిట్ చేస్తారు? " అని అడిగింది కోపంగా.

"ఎక్కడో పుక్కిటి పురాణాల్లో జరుగుతాయిగాని ఇలాంటి పరిస్థితులు మామూలు మనలాంటివాళ్ల జీవితాల్లో తటస్థ పడతాయని అనుకోలేదు. ఋషులు, దేవతలు, దేవుళ్లు తమవీర్యం ఎక్కడ వదిలేసినా ఏదో రకంగా ఎవరోఒకరిజన్మకి కారణమవ్వటం విన్నాం. మీరంత గొప్పవాళ్లనుకుంటే మరొక పెళ్లి చేసుకోండి నాకేమీ అభ్యంతరం లేదు "అని కూడా అంది.

శారద మనస్సులో అనేకరకాల ఆలోచనలు చెలరేగాయి. మేధావంతుడయిన భర్త ఉన్నప్పటికి అతనిసంతానానికి తను మాతృత్వాన్ని ఇవ్వలేక పోయినందుకు చాలాచిన్నపుచ్చుకుంది. సుధాకర్ సంతతి విజ్ఞానవంతులు, మేధావంతులు కావచ్చునని ప్రపంచంలో ఇంకెవళ్లో గుర్తించటంతో ఈ ఆవేదన మరింత కష్టపెట్టింది

శారదని. తను సహజంగా తల్లి కాలేకపోయినా తన భర్త సంతానానికి పెంపుడు తల్లిగానయినా ఉండేఅవకాశం వస్తే బాగుండునని ఎన్నోసార్లు అనుకుంది.

చివరికి ఒకసారి చాలాసీరియస్‌గానే అంది. "ఎవరికో తెలియనివాళ్లకి దానంచేసే బదులు తెలుసున్న వాళ్లకెవరికయినా యిచ్చి ఆఫలితం మనం దక్కించుకోవచ్చుగా. "

సర్రొగేట్‌గా ఎరుగున్నవాళ్ల నెవరినయినా ముందుగానే ఏర్పాటు చేసుకుందామా అని ఇద్దరూ కలిసి ఆలోచించారు. ఈ దేశంలో డబ్బుకోసం సర్రొగేట్‌గా ముందు ఉంటానని ఒప్పుకుని, తీరా బేబీ వచ్చాక బేబీమీద మమకారంచంపుకోలేక తమకికూడ బేబీపై హక్కులున్నాయి అంటూ కోర్టుకెళ్లిన వాళ్లున్నారు. అంచేత ఆవిషయంగురించి ఎక్కువగా పరిశీలించలేదు.

శారదలో అటువంటి ఆలోచనలుంటాయని సుధాకరరావు అనుకోలేదు ఎప్పుడూ. కొంత ఆశ్చర్యం కొంత అనుమానం తో కొన్నాళ్లు గడిపాడు.

తనుకారణంగా పుట్టిన పిల్లలు ఎక్కడో తనకి తెలియనిచోట పెరుగుతున్నారని తెలిసి ఎలా సంబంధంలేనట్టు ఉండడం?

ఒకవేళ ఆ పిల్లో పిల్లవాడో పెద్దయిన తర్వాత తనపుట్టుపూర్వోత్తరాలు ఎలాగో తెలుసుకుని తనదగ్గరకి వచ్చి " నీవు నాకు తండ్రివి" అని చెపితే ఎలా ఉంటుంది. తను పెంచిన వాళ్లే తన పిల్లలా? తను కారణంగా పుట్టిన వాళ్లందరూ తనపిల్లలు కాదూ?

సందేహాలతో సతమతమయ్యాడు కొన్నాళ్లు.

చివరికి ఒకరోజున జెనిటిక్ లాబ్ వాళ్లకి సరే అని ఉత్తరం వ్రాశాడు.

సుధాకర్ మనస్సులో స్పెరమ్ బేంక్‌కి డొనేషన్ ఇద్దామన్న నిర్ణయం ఎప్పుడు జరిగిందో ఖచ్చితంగా చెప్పడం కష్టం. అతని మాటల ధోరణిబట్టి గ్రహించింది శారద. ఆనాటినుంచి సర్రొగేట్‌తల్లి విషయం గురించి ఆలోచిస్తూనే ఉంది. ఇండియాలో తన స్నేహితురాలు శర్మిష్ఠ కి కూడా వ్రాసింది.

మెడికల్ కాలేజీలో చదువుకుంటున్నప్పుడు శారద, శర్మిష్ఠ లు ఎంతో క్లోజ్‌గా ఉండేవారు. ఒకరి మనస్సులో విషయం మరొకరికి పూర్తివివరాలతో చెప్పుకునేవారు ఏమి దాచకుండా.

"ఏ మగవాడితోనూ సంబంధం లేకుండా పిల్లలని కని తల్లిగా ఉండగలిగితే ఎంతబాగుండునో. మన [illegible]సంఘం అటువంటి ఆలోచనలు చేస్తేనే ఉరేసుకుని చావమని శాసిస్తుంది. మగతనానికి తలపాగ గట్టి ఆడవాళ్లని అధోలోకానికి అణగదొక్కే సంఘం ఇది. " అంది శర్మిష్ఠ ఒక రోజున.

"ఎందుకే పాపం అలా అంటావు. నీకు మగవాళ్లంటే ఇష్టంలేక అలా అంటున్నావు. అందరి మగవాళ్లు అధికారం చెలాయించే రకం కాదు. " శారద మందలించేది.

"నువ్వెప్పుడూ వాళ్లని వెనకేసుకు వస్తూనే ఉంటావు. నాకు వాళ్లలో చెప్పుకోదగ్గ సౌహార్ద్రం, సౌందర్యం ఏమీ కనిపించలేదు. స్త్రీస్వరూపంలో ఉన్న సౌందర్యం, సౌహార్ద్రత, సౌమ్యత, మాతృత్వభావం చస్తే వాళ్లకి రావు."

"బ్రహ్మదేవుడు పరిణ్షనిస్తే నువ్వు మరొక ఆడదాన్ని చేసుకుని పిల్లలని కనేటట్లున్నావు చూస్తూంటే."

"బ్రహ్మదేవుడు చేసిన పొరపాటే అది. లింగబేధాలతో ప్రపంచాన్ని రెండు ముక్కలు చేశాడు."

"అతనిది కాదమ్మా తప్పు. అది దక్షప్రజాపతి పొరమ్మా."

ఇటువంటి ఎడతెగని వాదాలతో వారి స్నేహం నిత్యచైతన్యవంతంగా ఉండేది. తను పెళ్లిచేసుకుని అమెరికా వచ్చేటప్పుడు ఇద్దరి మనస్సులు లోలోపల ఎంతో మధన పడ్డాయి.

సౌందర్యవతి, విజ్ఞానవంతురాలు. సృజనాశక్తిలో శర్మిష్ఠకు సాటి ఎవరూ లేరని చెప్పాలి. కథలు వ్రాస్తుంది, కవిత్వం వ్రాస్తుంది. ప్రఖ్యాత చిత్రకారిణి. శర్మిష్ఠ రావు వ్రాసినవి, శర్మిష్ఠరావుగురించి వ్రాసినవి ప్రతిపత్రికలోనూ ప్రచురింపబడుతూనే ఉంటాయి అస్తమానూ ఇండియాలో.

* * * * * *

" I will be very busy next week. I think I can make myself available on 15th and 16th of this month. It is possible to leave here on 14th evening"

" I will take care of the travel and hotel reservations for both of you. Please say hello to Mrs. Konti. I am looking forward to see both of you."

ఫోను హేంగప్ చేసి, బెడ్‌రూమ్‌లోకి వెళ్లి శారదని కదిలించి లేపి ఎనిమిది గంటలవుతోందని హెచ్చరించి వెళ్లిపోయాడు.

శారద నిన్న రాత్రంతా కాల్‌లో ఉంది. లేద్దామా వద్దా అని ఆలోచిస్తోంది. మళ్లీ ఫోన్ రింగయింది. మెస్సేజి వదుల్తారు కావలిస్తే అని కాస్సేపు ఊరుకుంది. కాని ఫోను రింగవటం మానలేదు. రికార్డింగ్ మెషీన్ ఆన్ చెయ్యటం మరచిపోయాడు సుధాకర్. లేచి ఫోను ఎత్తింది. ఓవర్సీస్ కాల్. ఆపరేటర్ మాటలు గబగబా దొర్లిపోతున్నాయి. పెర్సన్ టు పెర్సన్ కాల్ శర్మిష్ఠ దగ్గిరనుంచి.

"OK operator, I will accept the call." శారద, శర్మిష్ఠ బహుశః ఒక గంటసేపు మాట్లాడుకుని ఉంటారు. ఫోన్ పెట్టేసిన వెంటనే గబగబా తయారయి హాస్పటల్‌కి వెళ్లిపోయింది. శర్మిష్ఠ అమెరికా వస్తోంది. ఆమె మనస్సులో ఏదో నిర్వచించలేని సంతృప్తి ప్రవేశించింది.